ఉచిత కంటి వైద్య శిబిరం..163 మందికి పరీక్షలు



కంటి వైద్య శిబిరంలో భవానీనగర్‌ ఇన్‌స్పెక్టర్‌ బాలస్వామి తదితరులు

గౌలిపురా: స్వీయ జాగ్రత్తలతో కంటి సమస్యలు రాకుండా చూసుకోవచ్చని భవానీనగర్‌ ఇన్‌స్పెక్టర్‌ ఎం.బాలస్వామి అన్నారు. జహ్రా హెల్త్‌ కేర్‌, భవానీనగర్‌ పోలీసుల ఆధ్వర్యంలో ఆదివారం తలాబ్‌కట్టా సల్మాన్‌ మసీదు వద్ద ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఇన్‌స్పెక్టర్‌ బాలస్వామి కంటి వైద్య పరీక్షలు చేయించుకున్న వారికి అద్దాలను పంపిణీ చేశారు. ఈ ఉచిత కంటి వైద్య శిబిరంలో స్థానిక ప్రాంతాలకు చెందిన దాదాపు 163 మందికి ఉచిత కంటి పరీక్షలు నిర్వహించి 123 మందికి ఉచితంగా అద్దాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుత పరిస్థితుల్లో సెల్‌ఫోన్‌, కంప్యూటర్ల విని యోగం అధికం కావడంతో చాలా మంది కంటి సమస్యలతో బాధపడుతున్నారన్నారు. ముఖ్యంగా విద్యార్థులు వీటిని వీలైనంత తక్కువగా విని యోగించే విధంగా తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసు కోవాలన్నారు. ఒక వేళ ఏదైనా కంటి సమస్య వస్తే నిర్లక్ష్యం చేయకుండా వెంటనే డాక్టర్‌ని సంప్రదించి వైద్య సేవలు పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సైలు, జహ్రా హెల్త్‌ కేర్‌ వైద్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలు పేదలకు వరం

గోల్కొండ: సంక్షేమ పథకాలు పేదలకు వరమని ఎమ్మెల్యే కౌసర్‌ మోహియుద్దీన్‌ అన్నారు. ఆదివారం ఆయన టోలిచౌకీ మెరాజ్‌ కాలనీలోని తన కార్యాలయంలో లబ్ధిదారులకు మంజూరైన కల్యాణలక్ష్మి, షాదీముబారక్‌ చెక్కులను అందజేశారు. ఆయన మాట్లాడుతూ..పేదింటి అమ్మాయిల పెళ్లి కోసం కల్యాణలక్ష్మి పథకం ఎంతో ప్రయోజనకరంగా ఉందన్నారు. ఈ పథకాలే కాకుండా నిరుపేదలకు ఇంకా ఎన్నో ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలులో ఉన్నాయన్నారు. అర్హులైన వారు సంబంధిత కార్యాలయాల్లో సంప్రదించి మీసేవా కేంద్రాల్లో అవసరమైన ధ్రువపత్రాలతో దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో మజ్లిస్‌ నాయకులు హారూన్‌ఫరాన్‌, అలీముద్దీన్‌, అబీబ్‌చౌస్‌, మజీద్‌ఖాన్‌ తదితరులున్నారు.



చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే కౌసర్‌మోహియుద్దీన్‌

మహిళలు స్వశక్తితో ముందుకు సాగాలి



శిక్షణ పూర్తి చేసుకున్న వారితో ఆసీఫ్‌ హుస్సేన్‌ తదితరులు

గోల్కొండ: స్వ శక్తితో మహిళలు ముందుకు సాగాలని సకీనా ఫౌండేషన్‌ చైర్మన్‌ ఆసీఫ్‌ హుస్సేన్‌ సోహెల్‌ అన్నారు. అమెజాన్‌ సహకారంతో టోలిచౌకీ విరాట్‌నగర్‌ కాలనీలో కుట్టుశిక్షణ పూర్తి చేసుకున్న వంద మందికి ఆదివారం సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సకీనా ఫౌండేషన్‌ పేద బడుగు వర్గాలు కుటుంబ హింసకు గురైన మహిళలు, వితంతులకు తమ సేవా కార్యక్రమాల ద్వారా వివిధ రకాల శిక్షణ ఇస్తుందన్నారు. మూడు నెలల నుంచి విరాట్‌నగర్‌ కాలనీలో వంద మంది మహిళలకు బట్టలు కుట్టడంలో శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. అమెజాన్‌తో పాటు రోటరీ క్లబ్‌ జూబ్లీహిల్స్‌, శ్రీరామ్‌ ఇంటర్నేషనల్‌ స్కూల్‌ వారు తమ సహాయ సహకారాలు అందిస్తున్నారన్నారు. ఈ సందర్భంగా రోటరీ క్లబ్‌ ఆఫ్‌ జూబ్లీహిల్స్‌కు చెందిన రోటేరియన్‌ రుూన్సీ మాట్లాడుతూ..సకీనా ఫౌండేషన్‌ చేపడుతున్న మహిళా సాధికారిత కార్యక్రమాలకు తాము సంపూర్ణ సహాయ సహకారాలు అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీరామ్‌ ఇంటర్నేషనల్‌ స్కూల్‌ నజీబా హైదర్‌, రిజ్వాన్‌, అక్బర్‌, జ్యోతిరెడ్డి, తదితరులున్నారు.

మోదీ ప్రభుత్వంపై చార్జిషీట్‌ వేయాలి

అఫ్జల్‌గంజ్‌: తెలంగాణ రాష్ట్ర విభజన చట్టాలను పదేళ్లు గడిచినా ఇంకా అమలు చేయని ప్రధాన మంత్రి నరేంద్రమోదీ ప్రభుత్వంపై చార్జిషీట్‌ వేయాలని టీపీసీసీ అధికార ప్రతినిధి గౌరీసతీష్‌ పేర్కొన్నారు. నిధులు, నియామకాల కోసం తెలంగాణ ఏర్పడితే పదేళ్లు గడిచినా ఎందుకు అమలు చేయడం లేదన్నారు. ఆదివారం తన కార్యాలయంలో రాష్ట్ర నాయకులు శ్రీనివాస్‌, ప్రభాకర్‌తో కలిసి విలేకర్లతో మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం రైతులు, పేదలు, బడుగు వర్గాలకు దేశంలో ఎక్కడా లేని విధంగా సంక్షేమ పథకాలు ప్రవేశపెడితే రాష్ట్ర బీజేపీ నాయకులు జీర్ణించుకోలేక తప్పుడు ప్రచారాలు చేస్తున్నారన్నారు. ముందుగా తెలంగాణ ప్రజలకు, రైతులకు, నిరుద్యోగులను దగా చేసిన కేంద్ర ప్రభుత్వంపై రాష్ట్ర ప్రజలు త్వరలోనే చార్జిషీటు వేసే సమయం ఆసన్నమైందన్నారు. బీజేపీ రాష్ట్ర నాయకులు ఒక్కసారి మోదీ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన మేనిఫెస్టో, ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలపై మోదీని ఎందుకు నిలదీయడంలేదని గౌరీ సతీష్‌ ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కాంగ్రెస్‌ నాయకులు శ్రీనివాస్‌, ప్రభాకర్‌లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గౌరీ సతీష్‌

సంప్రదాయ కళలను భావి తరాలకు అందిద్దాం



ఆకట్టుకున్న చిన్నారుల నృత్య ప్రదర్శన

గన్‌ఫౌండ్రీ: సంప్రదాయ కళలను భావి తరాలకు అందిద్దామని పలువురు వక్తలు అన్నారు. తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో భారత రంగస్థలి అకాడమి ఆఫ్‌ ఫైనార్ట్స్‌ ఆధ్వర్యంలో 30 రోజుల పాటు నిర్వహించిన సైద్ధాంతిక కూచిపూడి నాట్య శిక్షణ శిబిరం ముగింపు ఉత్సవాలను ఆదివారం రవీంద్రభారతిలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాట్య గురువులు మాట్లాడుతూ..ప్రస్తుత యువతరానికి సైద్ధాంతిక పరమైన శిక్షణా శిబిరాలు నిర్వహించడం ఎంతో అవసరమన్నారు. అంతకు ముందు నాట్య మార్గం పేరిట సంస్థ చిన్నారులు ప్రదర్శించిన నృత్య కళారూపాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో నాట్య గురువులు సంగనభట్ల నర్సయ్య, ఇందిరా హేమ, సీహెచ్‌.నారాయణ మూర్తి, అకాడమి కార్యదర్శి కోకా విజయలక్ష్మి, నాట్య గురువు రవి తదితరులు పాల్గొన్నారు.

అబ్బురపరిచిన విద్యార్థినుల మార్షల్‌ ఆర్ట్స్‌



ర్యాలీలో ఎమ్మెల్యే మీర్‌ జుల్ఫీకర్‌ అలీ తదితరులు



మార్షల్‌ ఆర్ట్స్‌ ప్రదర్శనలో విద్యార్థినులు

చార్మినార్‌: అంజుమన్‌–ఇ–ఖాద్రీయ ఆధ్వర్యంలో ఆదివారం చార్మినార్‌–మక్కా మసీదు నుంచి కుడా స్టేడియం వరకు దీని తాలీం ర్యాలీ జరిగింది. చేతుల్లో ప్ల కార్డులు పట్టుకున్న విద్యార్థులతో కలిసి చార్మినార్‌ ఎమ్మెల్యే మీర్‌ జుల్ఫీకర్‌ అలీ, ముస్లిం మత పెద్దలు, చార్మినార్‌ ఇన్‌స్పెక్టర్‌ కమతం చంద్రశేఖర్‌ తదితరులు ర్యాలీలో పాల్గొన్నారు. అనంతరం కుడా స్టేడియంలో ఓ ప్రైవేట్‌ పాఠశాలకు చెందిన విద్యార్థినులు ప్రదర్శించిన మార్షల్‌ ఆర్ట్స్‌ పలువురిని ఆకట్టుకున్నాయి. ఆత్మరక్షణ కోసం తీసుకోవాల్సిన చర్యలను వివరిస్తూ విద్యార్థినులు నిర్వహించిన కర్ర సాము క్రీడలు అబ్బురపరిచాయి.

పదోన్నతులు పొందినా ఉన్నచోటే తిష్ట

- కింది స్థాయి అధికారులకు పోస్టింగ్‌ రాక గగ్గోలు
- ఇన్‌చార్జి కమిషనర్‌ ఉండడంతోనే రెవెన్యూ తగ్గుముఖం

అబిడ్స్‌: వాణిజ్య పన్నుల శాఖలో ప్రమోషన్లు వచ్చినా కొంత మంది ఉన్నతాధికారులు తమ తమ స్థానాలను వదలకపోవడంతో కింది విభాగాల్లో ఉన్న అధికారులకు పోస్టింగ్‌ రావడం లేదు. జాయింట్‌ కమిషనర్‌ నుంచి అడిషనల్‌ కమిషనర్‌గా ప్రమోషన్‌ పొందిన వారు తమ పాత స్థానాలను ఇంకా వదలకపోవడంతో సర్వత్ర ప్రమోషన్లు, ట్రాన్స్‌ఫర్ల లొల్లి కొనసాగుతోంది. జూనియర్‌ అసిస్టెంట్ల నుంచి సీనియర్‌ అసిస్టెంట్లుగా, సీనియర్‌ అసిస్టెంట్ల నుంచి ఏసీటీఓలుగా ప్రమోషన్లు పొందినా ఇంత వరకు పలువురు అధికారులకు ఆడర్స్‌ కానీ, పోస్టింగ్‌లు కానీ ఇవ్వకపోవడంతో వారంతా ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఏసీటీఓలుగా ప్రమోషన్లు పొంది నెలలు గడుస్తున్నా ఇంకా వారికి ఎందుకు పోస్టింగ్‌లు, ఆర్డర్లు ఇవ్వడం లేదని పలువురు ప్రశ్నిస్తున్నారు.

ఇతర శాఖలకు ఉన్నతాధికారులు..

కొంతమంది వాణిజ్య పన్నుల శాఖ ఉన్నతాధికారులను ఇతర శాఖలకు డిప్యూటేషన్‌పై పంపేందుకు సిద్ధమయ్యారు. పలువురు అధికారులపై నివేదికలు తీసుకున్న ప్రభుత్వం వారిని డిప్యూటేషన్‌పై త్వరలోనే ఇతర శాఖలకు పంపనున్నట్లు తెలిసింది. వారి విధుల పట్ల ప్రభుత్వం అసంతృప్తిగా, సీరియస్‌గా ఉన్నట్లు సమాచారం.



వాణిజ్యపన్నుల శాఖ కార్యాలయం

20 ఏళ్లుగా ఒకే కార్యాలయంలో..

ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఒక సీనియర్‌ అసిస్టెంట్‌ అధికారి 20 ఏళ్లుగా వాణిజ్య పన్నుల శాఖ ప్రధాన కార్యాలయంలో విధులు నిర్వహిస్తుండడంతో పలువురు అధికారులు, పలువురు సిబ్బంది ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. 20 ఏళ్లు ఒకే కార్యాలయంలో ఎలా పనిచేస్తారని పలువురు ప్రశ్నిస్తున్నారు. తన కార్యాలయానికి వచ్చే వారి పనులను ఏమాత్రం చేయడం లేదని పలువురు అంటున్నారు. అతనితో పర్సనల్‌గా కలిస్తేనే పనులు అవుతున్నాయని పలువురు సిబ్బంది పేర్కొంటున్నారు.

తగ్గుముఖం పట్టిన రెవెన్యూ..

ఈ సంవత్సర కాలంలో రెవెన్యూ తగ్గుముఖం పట్టిందని పలువురు పేర్కొంటున్నారు. ఇన్‌చార్జి కమిషనర్‌ ఉండడం ద్వారా వాణిజ్య పన్నుల శాఖ పురోగతి కావడం లేదన్నారు. అదేవిధంగా రెండు సార్లు బదిలీ అయిన కమిషనర్‌ తిరిగి వస్తున్నారని చర్చ జరుగుతుండడంతో పలువురు ఆశ్చర్యంలో ఉన్నారు. అనుభవం ఉన్న వాణిజ్య పన్నుల శాఖలో పని చేసిన ఐఏఎస్‌ అధికారికే కమిషనర్‌గా నియమిస్తే వాణిజ్య పన్నుల శాఖ ఎంతో అభివృద్ధి చెందుతుందని పలువురు ఉద్యోగులు సిబ్బంది పేర్కొంటున్నారు.

శాఖపై ఏసీబీ నజర్‌..

గత 5 నెలల్లో వాణిజ్య పన్నుల శాఖ అధికారులను ఏసీబీ అధికారులు అవినీతి ఆరోపణలపై కేసులు నమోదు చేశారు. ఇద్దరు డీసీటీఓ, ఒక ఏసీటీఓ, ఒక సీటీఓపై కేసులు నమోదు చేసి ఏసీబీ అధికారులు అరెస్టు చేశారు. కొన్ని నెలలుగా వాణిజ్య పన్నుల కార్యాలయాలపై ఏసీబీ ప్రత్యేక నజర్‌ పెట్టింది. పూర్తిగా అవినీతి నిరోధించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటుందన్నారు.

నేటి నుంచి అయ్యప్ప స్వాములకు అన్న ప్రసాదం



గాజుల అంజయ్య

చార్మినార్‌: ఈనెల 2 నుంచి వచ్చే నెల 8వ తేదీ వరకు అయ్యప్ప స్వాములకు ఉచితంగా అన్న ప్రసాదాన్ని అందజేయనున్నామని మీరాలం మండి మహంకాళేశ్వర ఆలయ కమిటీ చైర్మన్‌ గాజుల అంజయ్య తెలిపారు. దీక్షలో ఉన్న కొంత మంది అయ్యప్ప స్వాములు ఉద్యోగ, వ్యాపార రీత్యా బిజీగా ఉండడంతో బిక్ష తయారీ కోసం సమయం ఉండదని అటువంటి వారి కోసం తాము ఆలయ ప్రాంగణంలో ప్రతిరోజు ఉదయం 7 నుంచి 10 గంటల వరకు టిఫిన్స్‌ అందుబాటులో ఉంచుతున్నామన్నారు. ఈ టిఫిన్స్‌ కావాలనుకున్న అయ్యప్ప స్వాములు తమ వెంట ఖాళీ టిఫిన్‌ బాక్స్‌లు తెచ్చుకోవాలన్నారు. ఎలాంటి నిబంధనలు లేవన్నారు.

బీజేపీ శ్రేణుల బైక్‌ ర్యాలీ



నాంపల్లి: కాంగ్రెస్‌ పార్టీ ప్రకటించిన ఆరు గ్యారెంటీలు పూర్తిగా వైఫల్యం చెందాయని బీజేపీ నేత సాయి సందీప్‌ ఆరోపించారు. ఈ మేరకు ఆదివారం నాంపల్లి నియోజకవర్గంలో కాంగ్రెస్‌ పార్టీ పథకాల వైఫల్యాలను నిరసిస్తూ బీజేపీ శ్రేణులు బైక్‌ ర్యాలీని చేపట్టారు. మల్లేపల్లి డివిజన్‌ అధ్యక్షుడు జగన్నాథరాజు ఆధ్వర్యంలో ఈ బైక్‌ ర్యాలీ మల్లేపల్లిలో ప్రారంభమైంది. నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో ర్యాలీని చేపట్టారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నేతలు సుమంత్‌, భుజందర్‌, పవన్‌కుమార్‌, రమేష్‌ పాల్గొన్నారు.

రికవరీ చేసిన సెల్‌ఫోన్ల అప్పగింత



గోల్కొండ: చోరీలు చేసే వారి ఎత్తులకు పైఎత్తులు వేసి వారిని పట్టుకుంటున్నామని గోల్కొండ ఏసీపీ సయ్యద్‌ఫయాజ్‌ అన్నారు. ఆదివారం గోల్కొండ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దొంగతనానికి గురైన 24 సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకొని వాటిని బాధితులకు అందిస్తున్నామన్నారు. సీఈఐఆర్‌ పోర్టల్‌ ద్వారా ఫోన్‌లను గుర్తిస్తున్నామన్నారు. తెలంగాణ పోలీసులకు ఎన్నో అధునాతన పరికరాలు అందుబాటులో ఉన్నాయని, ఘరానా దొంగలతో పాటు హైటెక్‌ దొంగలను సైతం పట్టుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో గోల్కొండ ఇన్‌స్పెక్టర్‌ సైదులు, డిటెక్టివ్‌ ఇన్‌స్పెక్టర్‌ రాజేంద్రప్రసాద్‌, డీఎస్‌ఐ రఫీయుద్దీన్‌ తదితరులున్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

రాయదుర్గం: గుల్‌మోహర్‌ పార్కు కాలనీ డబుల్‌ ఇళ్లవాసుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని మాజీ కార్పొరేటర్‌ కొమిరిశెట్టి సాయిబాబా అన్నారు. గుల్‌మోహర్‌పార్కు కాలనీవాసులు ఆదివారం ఖాజాగూడలోని బీఆర్‌ఎస్‌ పార్టీ కార్యాలయంలో ఆయన్ని కలిసి సత్కరించారు. ఈ సందర్భంగా సాయిబాబా మాట్లాడుతూ డబుల్‌ ఇళ్లలో నివాసముండే వారికి సౌకర్యాలు కల్పించాల్సిన అవసరం ఉందన్నారు.

భక్తిశ్రద్ధలతో అమావాస్య పూజలు



అమ్మవారికి పూజలు చేస్తున్న సురేష్‌చారి



పూజల్లో ఆర్యవైశ్య ప్రతినిధులు

గౌలిపురా: వాసవి అన్నపూర్ణ సేవా సంస్థ లాల్‌దర్వాజా గౌలిపురా ఆధ్వర్యంలో కార్తీక అమావాస్య పర్వదినాన్ని పురస్కరించుకొని ఆదివారం గౌలిపురా బతుకమ్మ బావి వద్ద గల లక్ష్మీనారాయణ స్వామి ఆలయంలో పరమశివునికి విశేష పూజలు, రుద్రాభిషేకం నిర్వహించారు. అనంతరం ఛత్రినాక పాత పోలీస్‌స్టేషన్‌ వద్ద అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ కార్యదర్శి, వాసవి సేవా కేంద్రం లైఫ్‌ టైమ్‌ అడ్వైజర్‌ కొండ్లె మల్లికార్జున్‌ గుప్తా, హైదరాబాద్‌ జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు సరాబు లక్ష్మణ్‌గుప్తా, ఆర్యవైశ్య మహాసభ మెంబర్‌షిఫ్‌ కమిటీ చైర్మన్‌ గందె హనుమంత్‌ రావు, సంస్థ అధ్యక్షులు శ్రీరాం కోటయ్య గుప్తా, ప్రధాన కార్యదర్శి శ్రీధర మల్లికార్జున్‌ గుప్తా, కోశాధికారి ఇరుకుల్ల భిక్షపతి గుప్తా, జాయింట్‌ సెక్రటరీలు గుబ్బ శ్రీనివాస్‌ గుప్తా, బెజుగం చంద్రమోహన్‌ గుప్తా, సభ్యులు పడకంటి వెంకటేశం, ముక్క శేఖర్‌, గౌరిశెట్టి విశ్వనాథం తదితరులు పాల్గొన్నారు.

మహంకాళి అమ్మవారికి పూజలు..

గోల్కొండ: గోల్కొండ కోటపై కొలువుదీరి ఉన్న మహంకాళి అమ్మవారికి ఆదివారం అమావాస్య పూజలు జరిగాయి. గోల్కొండ పరిసర ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి పూజల్లో పాల్గొన్నారు. ఆలయ పూజారి బి.సురేష్‌చారి పూజలు నిర్వహించారు.

విజయోత్సవాలకు పాతబస్తీలో భారీ ఏర్పాట్లు

చార్మినార్‌: కాంగ్రెస్‌ పార్టీ ఏడాది పాలనను పురస్కరించుకుని నిర్వహించే విజయోత్సవాలను పెద్ద ఎత్తున నిర్వహించడానికి పాతబస్తీలోని నాలుగు నియోజకవర్గాలలో తగిన ఏర్పాట్లు చేస్తున్నామని నాలుగు నియోజకవర్గాల కాంగ్రెస్‌ పార్టీ కాన్‌టెస్టెడ్‌ ఎమ్మెల్యేలు, ఆయా నియోజకవర్గాల ఇన్‌చార్జీలు వెల్లడించారు. చార్మినార్‌ ఇన్‌చార్జి ముజీబ్‌ ఉల్లా షరీఫ్‌ ఆధ్వర్యంలో చార్మినార్‌ నియోజకవర్గంలోని మూసాబౌలిలో సన్నాహక ఏర్పాట్లపై సంబంధిత నియోజకవర్గాల కో ఆర్డినేటర్లతో సమావేశం జరిగింది. చార్మినార్‌ కో ఆర్డినేటర్‌ బాల్‌రాజ్‌, చాంద్రాయణగుట్ట కో ఆర్డినేటర్‌ డాక్టర్‌ రియజ్‌, యాకుత్‌పురా కో ఆర్డినేటర్‌ మచ్చ వరలక్ష్మి, బహదూర్‌పురా కో ఆర్డినేటర్‌ అల్లం భాస్కర్‌తో పాటు చార్మినార్‌ ఇన్‌చార్జి ముజీబ్‌ ఉల్లా షరీఫ్‌, బహదూర్‌పురా ఇన్‌చార్జి పులిపాటి రాజేష్‌ కుమార్‌(రాహుల్‌), యాకుత్‌పురా ఇన్‌చార్జి రవిరాజ్‌, చాంద్రాయణగుట్ట ఇన్‌చార్జి నరేష్‌ తదితరులతో పాటు చార్మినార్‌ మాజీ ఇన్‌చార్జి వెంకటేష్‌ మేరు తదితరులు పాల్గొని ఈనెల 7, 8, 9 తేదీలలో నిర్వహించే విజయోత్సవాలపై సుదీర్ఘంగా చర్చించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. విజయోత్సవాల కోసం ఇప్పటికే పార్టీ అధిష్టానం నియోజకవర్గాల వారీగా కో ఆర్డినేటర్లను నియమించిందన్నారు. వీరి పర్యవేక్షణలో ఈ నెల 7న డివిజన్‌లలో, 8న నియోజకవర్గాలలో సన్నాహక ఏర్పాట్లపై సమావేశాలను నిర్వహించనున్నామన్నారు. అనంతరం ఈ నెల 9న డాక్టర్‌ బీ.ఆర్‌.అంబేడ్కర్‌ రాష్ట్ర సచివాలయం వద్ద నిర్వహించే ఏడాది పాలన విజయోత్సవాలలో పాల్గొననున్నామన్నారు. ఇందుకోసం పాతబస్తీలోని నాలుగు నియోజకవర్గాల నుంచి నాయకులు, కార్యకర్తలు, పార్టీ అభిమానులను సిద్ధం చేయనున్నామన్నారు.



సమావేశంలో సీనియర్‌ కాంగ్రెస్‌ నాయకులు

సండే.. సందడి

చార్మినార్‌: పాతబస్తీలోని పర్యాటక ప్రాంతాలన్నీ ఆదివారం సందడిగా కనిపించాయి. ముఖ్యంగా చార్మినార్‌ పరిసరాలు సందర్శకులతో రద్దీగా మారాయి. కాలు తీసి కాలు పెట్టలేనంత జనం కనిపించారు. సాధారణ రోజుల కన్నా..వీకెండ్‌ అయిన ఆదివారం సందర్శకుల సందడి ఎక్కువైంది. దీంతో ట్రాఫిక్‌ సమస్యలు కూడా ఎక్కువయ్యాయి. ఆదివారం మధ్యాహ్నం నుంచి రాత్రి వరకు నయాపూల్‌ నుంచి గుల్జార్‌ హౌజ్‌ వరకు ట్రాఫిక్‌ తిప్పలు తప్ప లేదు. అర్ధ రాత్రి వరకు చార్మినార్‌ పరిసరాలలో సందర్శకుల సందడి కనిపించింది.

గోల్కొండ కోటలో..

గోల్కొండ: గోల్కొండ కోటకు ఆదివారం భారీగా పర్యాటకులు తరలివచ్చారు. వేల సంఖ్యలో వచ్చిన పర్యాటకులతో గోల్కొండ కోట చౌరస్తా జాతరను తలపించింది. భారీగా తరలివచ్చిన పర్యాటకులతో కోటలోని ప్రధాన ద్వారం వద్ద గల ఫిరంగి, క్లాపింగ్‌ పోర్టికో ప్రాంతాల్లో పర్యాటకులు సందడి చేశారు. ఫిరంగుల వద్ద పర్యాటకులు పోటీపడి సెల్ఫీలు దిగారు. వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు కోటలోని ఆయుధాగారం వద్ద వివిధ రకాల ఆయుధాలను చూసి నోరెళ్లబెట్టారు. మరోవైపు విదేశీ పర్యాటకులు సైతం పెద్ద సంఖ్యలో కోట చూడడానికి తరలివచ్చారు.



విదేశీ పర్యాటకులకు కోట విశేషాలు వివరిస్తున్న గైడ్‌



చార్మినార్‌ రోడ్డులో సందర్శకులు

వార్షికోత్సవం



చిన్నారుల సాంస్కృతిక కదంబం

నాంపల్లి: ఆల్‌ సెయింట్స్‌ హైస్కూల్‌ 169వ వార్షికోత్సవం వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ వేడుకలను బ్రదర్‌ విన్సెంట్‌ మెన్‌డోన్సా, రాఫ్‌ బ్రదర్‌ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాఠశాల పూర్వ విద్యార్థి, నిమ్స్‌ అసిస్టెంట్‌ ప్రొఫెసర్‌ డాక్టర్‌ చల్లా మాధురి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులను అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. సభానంతరం విద్యార్థులు కుటుంబ విలువలు, పర్యావరణ సంరక్షణపై ప్రత్యేక నాటకాన్ని ప్రదర్శించారు. అదే విధంగా పలు సాంస్కృతిక ప్రదర్శనలను ప్రదర్శించి సందడి చేశారు. ఈ కార్యక్రమంలో లిటిల్‌ ఫ్లవర్‌ డిగ్రీ కళాశాల డైరెక్టర్‌ రెవరెండ్‌ బ్రదర్‌ జాన్‌ కలరికల్‌, చార్మినార్‌ ఎమ్మెల్యే జుల్ఫీకర్‌ అలీ పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు



గోల్కొండ: ప్రజా పాలన–ప్రజా విజయోత్సవాల సందర్భంగా ఆదివారం గోల్కొండ మండలానికి చెందిన విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా గోల్కొండ ముఫీద్‌ ఉన్‌ నిస్వాన్‌ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఈ పోటీలు జరిగాయి. గోల్కొండ డిప్యూటీ ఐవోఎస్‌ మక్బూల్‌ అహ్మద్‌ పర్యవేక్షణలో జరిగిన ఈ పోటీల్లో పలు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. సెయ్యద్‌ జాకేర్‌ హుస్సేన్‌, విజయ్‌ల ఆధ్వర్యంలో ఈ పోటీలు జరిగాయి. మొదటి రెండు స్థానాల్లో నిలిచిన వారికి జిల్లాస్థాయి పోటీల్లో పాల్గొనే అవకాశం ఉంటుందని ఆయన తెలిపారు.

ఈశ్వరీబాయి సేవలు మరువలేనివి



నివాళులర్పిస్తున్న బుంగ శివకుమార్‌

చార్మినార్‌: దళిత బడుగు బలహీన వర్గాల అభివృద్ధికి నిరంతర కృషి చేసిన ఈశ్వరీబాయి సేవలను మరువలేమని తెలంగాణ ఎస్సీ, ఎస్టీ ఐక్యవేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు బుంగ శివకుమార్‌ కొనియాడారు. ఈశ్వరీబాయి జయంతి వేడుకలను పురస్కరించుకుని ఆయన ఆదివారం వెస్ట్‌ మారేడ్‌పల్లిలోని ఆమె విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..కార్పొరేటర్‌గా, ఎమ్మెల్యేగా పని చేసిన ఆమె బడుగు బలహీన వర్గాల మహిళల అభ్యున్నతికి పని చేశారన్నారు. 1969లో తెలంగాణ ఉద్యమంలో ఆమె ముఖ్యపాత్ర పోషించారన్నారు.

ఆధునిక సాంకేతికతతో ప్రాంతీయ డెంటల్‌ చారిటబుల్‌ సేవలు



వేడుకలను ప్రారంభిస్తున్న డాక్టర్‌ డీఎన్‌ స్వామి తదితరులు

అఫ్జల్‌గంజ్‌: ఆధునిక సాంకేతికతతో డెంటల్‌ రంగంలో ప్రాంతీయ డెంటల్‌ చారిటబుల్‌ హాస్పిటల్స్‌ విశేష సేవలందిస్తున్నాయని ఇండియన్‌ డెంటల్‌ అసోసియేషన్‌ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్‌ డీఎన్‌ స్వామి పేర్కొన్నారు. ఏషియన్‌ ఇనిస్టిట్యూట్‌ ఫర్‌ అడ్వాన్సుడ్‌ డెంటిస్ట్‌ (ఏఐఏడీ) 13వ వార్షికోత్సవ వేడుకలను ఆయన ప్రారంభించి ప్రసంగించారు. ఏఐఏడీ అనుబంధ ప్రాంతీయ డెంటల్‌ చారిటబుల్‌ ఆసుపత్రులలో డెంటిస్ట్‌లు అందిస్తున్న సేవలు అమోఘమన్నారు. వారి కృషితో పేదలకు పలు విధాల డెంటల్‌ సేవలు అందుతున్నాయన్నారు. సొసైటీ అధ్యక్షుడు డాక్టర్‌ సునీల్‌కుమార్‌ కోతవార్‌ మాట్లాడుతూ..ప్రాంతీయ డెంటల్‌ ఆసుపత్రులలో పేదలు, అవసరమైన వారికి సేవలందించిన డెంటిస్ట్‌లకు ఫెలోషిప్‌ అవార్డులు అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్‌ రాకేష్‌ మోదే, డాక్టర్‌ అవినాష్‌, డాక్టర్‌ అనిల్‌కుమార్‌, డాక్టర్‌ బాల సునీల్‌కుమార్‌, డాక్టర్‌ సత్యనారాయణ రావు, ఫేషియల్‌ సర్జన్‌ డాక్టర్‌ నవీన్‌ కొక్కులతో పాటు దాదాపు 800 మంది ప్రతినిధులు పాల్గొన్నారు.

తెలుగు యూనివర్సిటీ పేరు మార్పుపై పునరాలోచన చేయాలి



బోనాల శ్రీనివాస్‌

అఫ్జల్‌గంజ్‌: పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీ పేరు మార్పుపై ప్రభుత్వం పునరాలోచన చేసే విధంగా ఆర్యవైశ్య పెద్దలు ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని ప్రజా ఏక్తా పార్టీ జాతీయ అధ్యక్షుడు బోనాల శ్రీనివాస్‌ డిమాండ్‌ చేశారు. ఈ మేరకు ఆదివారం మహారాజ్‌ గంజ్‌లోని పార్టీ కేంద్ర కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ..ఈ నెల 4న మాజీ సీఎం రోశయ్య వర్ధంతి సందర్భంగా నిర్వహించే కార్యక్రమంలో ప్రభుత్వం దృష్టికి ఈ విషయాన్ని తీసుకువెళ్లాలని విన్నవించారు.

రాజ్‌భవన్‌లో నాగాలాండ్‌ ఫౌండేషన్‌ డే

రాయదుర్గం: రాష్ట్ర గవర్నర్‌ జిష్ణుదేవ్‌వర్మ నాయకత్వంలో రాజ్‌భవన్‌లో ఏర్పాటు చేసిన నాగాలాండ్‌ ఫౌండేషన్‌ డే కార్యక్రమంలో హెచ్‌సీయూ ఫ్యాకల్టీ, విద్యార్థులు పాల్గొన్నారు. హెచ్‌సీయూ క్యాంపస్‌ నుంచి నాగాలాండ్‌కు చెందిన విద్యార్థులు, ఫ్యాకల్టీ ప్రతినిధులు తరలివెళ్లారు. అక్కడ నిర్వహించిన కార్యక్రమంలో భాగస్వాములయ్యారు. ఏక్‌భారత్‌– శ్రేష్ఠభారత్‌ (ఈబీఎస్‌బీ) పేరిట కేంద్ర ప్రభుత్వం, రాజ్‌భవన్‌ల సంయుక్త ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. హెచ్‌సీయూ ఈబీఎస్‌బీ కోఆర్డినేటర్‌ డాక్టర్‌ వి వంశీకృష్ణారెడ్డి నాయకత్వంలో ఈ కార్యక్రమం కొనసాగింది.